క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు

పాయకరావుపేట : పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు వందేమాతరం నేర్పించారు. అనంతరం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్. సీతారామయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

ప్రమాదకరంగా బ్రిటిష్‌కాలం నాటి బ్రిడ్జి



శిథిలావస్థకు గురైన బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి

మునగపాక : మండల కేంద్రంలోని కృష్ణంరాజు కాలువపై నిర్మించిన బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జి కావడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. నిత్యం అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వైపునకు వందలాది వాహనాలు ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగించాల్సి ఉంది. భారీ వాహనాలు సైతం ఇదే ప్రాంతం మీదుగా ప్రయాణిస్తున్నాయి. అయితే కాలం చెల్లిన బ్రిడ్జిపై ప్రయాణం భయంగా ఉందంటూ పలువురు వాపోతున్నారు. బ్రిడ్జికి జరగానిది జరిగితే ఈ మార్గం గుండా రాకపోకలు బంద్ అయ్యే ప్రమాదం లేకపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



దిమిలి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

రాంబిల్లి : వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దిమిలి లైబ్రేరియన్ ఎస్. శకుంతల అన్నారు. ఆదివారం ఇక్కడి గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. నీతి కథలు చెప్పారు. భక్తి పాటలు పాడించారు. పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు విజ్ఞానదాయకం



విద్యార్థులకు మిఠాయిలు పంచుతున్న దృశ్యం

అచ్యుతాపురం : విద్యార్థులు వేసవి సెలవుల్లోనూ రోజుకు కొంత సమయం చదువు కోసం కేటాయించాలని రిసోర్స్ పర్సన్ పి.శివకృష్ణ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం లెక్కలలో మెళకువలు నేర్పించారు. అనంతరం విద్యార్థులతో నీతి కథలు చెప్పించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు.

ఘనంగా త్రిపురాంతక స్వామి పెళ్లిరాట



శివాలయం వద్ద పెళ్లిరాట వేస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక పురాతన శివాలయ ఆవరణలోని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి వారి పెళ్లిరాట ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 23న స్వామి వార్ల 108వ కల్యాణోత్సవం జరగనుంది. దీనిలో భాగంగా పెళ్లిరాట ఉత్సవాన్ని నిర్వహించారు. సంప్రదాయంగా నేరేడు కొమ్మను తెచ్చి పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి వేద మంత్రాల నడుమ పూజలు జరిపి, పెళ్లిరాట నిలిపారు.

మామిడి తాండ్ర పుల్లన

- కానరాని తాండ్ర దుకాణాలు
- మామిడి దిగుబడి తగ్గి పెరిగిన ధరలు
- గిట్టుబాటు లేక తయారీకి స్వస్తి పలికిన వ్యాపారులు



మామిడి తాండ్ర తయారు చేస్తున్న దృశ్యం (ఫైల్)

నక్కపల్లి : ఈ సీజన్‌లో నియోజకవర్గంలో పలు ప్రాంతాలల్లో మామిడి తాండ్ర తయారీ కానరాలేదు. ప్రతి ఏటా మామిడి కాయల సీజన్‌లో నక్కపల్లి మండలంలో వేంపాడు, చిన దొడ్డిగల్లు, ఉద్దండపురం, కాగిత , రేబాక, రమణయ్యపేట, తదితర ప్రాంతాల్లో మామిడి తాండ్ర తయారీ చాలా ఎక్కువగా జరిగేది. ఈ ప్రాంతాల్లో సుమారు 15 వరకు మామిడి తాండ్ర దుకాణాలు ఏర్పాటు చేసేవారు. మామిడి గుజ్జును తాండ్రగా తయారు చేసి స్థానికంగా విక్రయించడంతో పాటు, ఇతర ప్రాంతాలకు సుమారు 50 నుంచి 100 టన్నుల వరకు ఎగుమతి చేసేవారు. ఈ తాండ్ర తయారీపై చుట్టు పక్కల సుమారు 150 నుంచి 200 మంది వరకు ఉపాధి పొందేవారు. ఈ దుకాణాల్లో తయారైన మామిడి తాండ్రను మరి కొంతమంది టోకు పద్ధతిలో టోల్‌గేట్ వద్ద విక్రయిస్తూ లబ్ధి పొందేవారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా మామిడి కాయల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో దాదాపు 15 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. చాలా తోటల్లో పూత దశలో తెగుళ్ల రావడం , పొగమంచు కారణంగా మామిడి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఈ ఏడాది మామిడి పండ్లకు గిరాకీ పెరిగింది. దిగుబడి ఎక్కువగా ఉన్న సమయంలో కలెక్టర్, సువర్ణరేఖ, నీలం, దేశవాళి, బంగినపల్లి, రసాలు వంటి రకాలను మామిడి తాండ్ర తయారీ దారులు కొనుగోలు చేసి గుజ్జు చేసి తాండ్ర తయారీకి ఉపయోగించేవారు. దిగుబడి తగ్గిపోవడంతో ధర కూడా విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం కలెక్టర్ మామిడి కాయలు టన్ను రూ.35 వేలు ఉంది. బంగినపల్లి రకాలయితే టన్ను రూ.40 వేలు వరకు ఉంది. సువర్ణరేఖ రూ.50 వేలకు పైబడే ఉంది. చౌకగా వస్తే తప్ప అధిక ధర ఉన్న సమయంలో తాండ్ర కోసం మామిడిని కొనుగోలు చేయడం కష్టమని భావించిన తాండ్ర వ్యాపారులు ఈ ఏడాది దుకాణాలు ప్రారంభించలేదు. రసాలు, దేశవాళీ, ఇతర రకాల మామిడి కాయలు సైతం టన్ను 20 వేల రూపాయల పైబడే ఉన్నాయి. అంత ధరపెట్టి కాయలను కొనడంతో పాటు ముడి సరకులు, తయారీ దార్లకు, ఎండ బెట్టడానికి, కార్మికులకు ఇచ్చే వేతనాలతో గిట్టుబాటు కాదని భావించిన వ్యాపారులు ఈ ఏడాది తాండ్ర తయారీకి స్వస్తి పలికినట్టు సమాచారం. కార్మికులకు వేతనం రూ.500 నుంచి రూ.800 వరకు చెల్లించాల్సి వస్తోంది. దేశవాళీ, కలెక్టర్, ఇతర జాతులకు చెందిన రకాలను జ్యూస్‌ల కోసం రాష్ట్రంలో పలు ప్రాంతాలతో పాటు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో మామిడి తాండ్ర వ్యాపారులకు తయారీకి అవసరమైన మామిడి కాయలు అందుబాటు ధరల్లో లభించడం లేదు. దీంతో ఈ ఏడాది తాండ్ర తయారీకి స్వస్తి పలికారు. సాహసం చేసి తాండ్ర తయారీ మొదలుపెట్టినా గతంలో కంటే రెట్టింపు ధరలకు విక్రయించాల్సి ఉంటుంది. రెట్టింపు ధరపెట్టి కొనుగోలు చేసేవారు కూడా ఉండరు. గత ఏడాది మామిడి తాండ్ర కిలో రూ.300 ఉంటే ఈ ఏడాది రూ.500 నుంచి రూ.600లకు విక్రయిస్తే తప్ప గిట్టుబాటు రాదు. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో నష్టాలను చవి చూడాల్సిన దుస్థితి వస్తుందని భావించి ఈ ఏడాది తయారీకి స్వస్తి పలికినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

గిట్టుబాటు లేదు...

ప్రతి ఏటా తాండ్ర తయారు చేసి విక్రయించేవాళ్లం. దిగుబడి ఎక్కువగా ఉంటే ధరలు కూడా అందుబాటులో ఉండేవి. ఈ ఏడాది కాయలు దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో తాండ్రకు ఉపయోగపడే కాయలు ధర అమాంతం పెరిగింది. పెట్టుబడి ఖర్చులు కూడా పెరిగిపోయాయి. కూలీలు కూడా దొరకడం లేదు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని తాండ్ర తయారీకి ఈ ఏడాది స్వస్తి పలకడం జరిగింది.

–అప్పారావు,
మామిడి తయారీదారు, వేంపాడు

వెంకన్న ఆలయ నిర్మాణ పనులపై దృష్టి సారించాలి



శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులపై చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మునగపాకలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పనులు వేగవంతమయ్యేలా చూడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఆలయ నిర్మాణ పనులకు సంబంధించి ఆదివారం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భక్తుల విరాళాలతో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పనులు నాణ్యతతో జరిగేలా చూడాలన్నారు. విరాళాల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంతవరకు ఎంతమేర నగదు వసూలైంది. ఎంతమేర ఖర్చు జరిగిందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పెద్దలు మళ్ల సంజీవరావు, దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, దాడి సూరిబాబు, దాడి శ్రీరామమూర్తి, వెలగా శ్రీనివాసరావు, ఆడారి లక్ష్మణరావు, వేగి కృష్ణ, ఆడారి కృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిర్లక్ష్యం



ఇందేశమ్మవాక సమీపంలో వరహానదిలో అక్రమ ఇసుక రవాణా తరలించే ప్రదేశం

ఎస్.రాయవరం : మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. గ్రామాల్లో పట్టపగలు ఇసుక తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దార్లపూడి శివారులో ఇందేశమ్మవాక వద్ద పదుల సంఖ్యలో ఎడ్లబళ్లు ట్రాక్టర్లు ఉపయోగించి పెద్ద ఎత్తున ఇసుక రవాణా చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాలతో పాటు ఆదివారం ఈ అక్రమ ఇసుక రవాణా మరింత జోరు పెంచారు.

సోమిదేవపల్లి గ్రామంలో అక్రమ ఇసుక రవాణా పెద్ద ఎత్తున చేస్తున్నారు. వరహానది నుంచి మూటలతో ఇసుక బయటకు తరలించి ఆటోలు, ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో గతంలో ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు టోల్ గేట్లు కూడా ఏర్పాటు చేశారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడరాదు



ఏటికొప్పాకలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ షేక్ గఫూర్



ఏటికొప్పాకలో ఆటోతో ప్రచారం చేస్తున్న యలమంచిలి రూరల్ పోలీసులు

యలమంచిలి : సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ప్రజలెవరు పాల్పడరాదని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ అన్నారు. ఆయన ఆదివారం యలమంచిలి మండలంలో ఏటికొప్పాక , సమీప గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసిన ఎన్నికల ఫలితాలు వచ్చాక గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడరాదని ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ఐకమత్యంగా మెలగాలని ఎన్నికల కోడ్ ఇంకా అమల్లోనే ఉందన్న విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. ఎక్కడైనా రాజకీయ పార్టీల కార్యకర్తలు ,నాయకులు గొడవలు కొట్లాటలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి రూరల్ ఎస్‌ఐ సింహాచలం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన ఏటికొప్పాక, కొక్కిరాపల్లి, జంపపాలెం, కొత్తపాలెంలో రాజకీయపార్టీల నాయకులు, ఇతరుల కదలికలపై యలమంచిలి పట్టణం , రూరల్ పోలీసులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. గొడవలకు అవకాశం ఉన్న గ్రామాల్లో 144 సెక్షన్ విధించడంతో అక్కడ ఆటోల్లో తిరుగుతూ నలుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడవద్దని మైకులో చెబుతున్నారు. ఎవరూ ర్యాలీలు గానీ, ఊరేగింపులు గానీ నిర్వహించకూడదని, ప్రతిపక్షపార్టీల వారిని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



బొజ్జన్నకొండ వద్ద జీవీఎంసీ చిన్న హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అనకాపల్లి:మండలంలో శంకరం పంచాయతీ బొజ్జన్న కొండ వద్ద పట్టణంలోని జీవీఎంసీ చిన్నహైస్కూల్‌కు చెందిన 1993–94 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయకలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ప్రతినిధి పెంటకోట పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 29 సంవత్సరాల తరువాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గల్ఫ్, అబుదాబి నుంచి పూర్వవిద్యార్థులు వచ్చారు. ఇకపై ఏటా ఫిబ్రవరి 2వ ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కాండ్రేగుల రామలింగేశ్వరరావు, జగన్నాథరావు, బత్తుల నూకేష్, ఆళ్ల శివాజీ, అల్లెపు కాశన్న, షేక్‌చాంద్ బాషా పాల్గొన్నారు.

నేటి నుంచి తెలుగు భాషా శిక్షణ

మునగపాక : మునగపాక పంచాయతీ కార్యాలయం దరి సోమవారం నుంచి తెలుగు భాషపై పట్టు సాధించేందుకు అవసరమయ్యే శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని యువ రచయిత విల్లూరి జగ్గప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో రాయడం, చదవడం వంటి అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తామన్నారు. తెలుగు భాష అధ్యయన వేదిక పేరుతో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్షరాలు, ఒత్తులు పలికే విధానం, రాసే విధానం వంటి విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9182259317 ఫోన్ నంబరును సంప్రదించాలని జగ్గప్పారావు కోరారు.

గ్రామాల్లో 144 సెక్షన్‌పై ప్రచారం



ఉప్పరాపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ విభీషణరావు

ఎస్.రాయవరం : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున్న గ్రామాల్లో సమావేశాలు, స్టేజ్ ప్రోగ్రామ్ నిర్వహించవద్దని ఎస్‌ఐ విభీషణరావు అన్నారు. ఉప్పరాపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూన్ 6 వరకు కోడ్ అమల్లో ఉందన్నారు. అలాగే 144 సెక్షన్ పై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ శానాపతి శ్రీరాములు, మాజీ సర్పంచ్ తుమ్మపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో వేసవి హాకీ శిక్షణ శిబిరం

- జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహణ
- నెల రోజుల పాటు శిక్షణ



నక్కపల్లి క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

నక్కపల్లి : మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హెటిరో హాకీ క్రీడా ప్రాంగణంలో వేసవి హాకీ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకటరమణ తెలిపారు. బీఎస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేసవి శిబిరం నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. శనివారం నుంచి ఈ శిక్షణ ప్రారంభించడం జరిగిందన్నారు. కోచ్ రాంబాబు హాకీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, కె.తాతాజీల పర్యవేక్షణలో ప్రతి రోజు ఈ వేసవి శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నక్కపల్లి పరిసర ప్రాంత క్రీడాకారులకు హాకీపై తర్ఫీదు ఇస్తామన్నారు. బీఎస్ హాకీ క్లబ్ ద్వారా ఇప్పటికే వందలాది మంది క్రీడాకారులకు తర్ఫీదు ఇవ్వడం జరిగిందన్నారు. వీరంతా జిల్లా, రాష్ట్ర, జాతీయ హాకీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచడం జరుగుతోందన్నారు. నక్కపల్లిలో హాకీ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఇటీవల ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండుసార్లు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలతో పాటు, స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలు పొందారన్నారు. అలాగే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా పొందడం జరిగిందని క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి హాకీలో తర్ఫీదు ఇచ్చేందుకు ఇక్కడ హాకీ క్లబ్ ఏర్పాటు చేసి ప్రతిరోజు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. వేసవి కాలంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరాన్ని నక్కపల్లి పరిసర ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమ్మర్ క్యాంపులో తర్ఫీదు పొందేందుకు వచ్చే విద్యార్థులకు దాతల సాయంతో అల్పాహారం అందించడం జరుగుతుందన్నారు. క్రీడా సామగ్రి కూడా అందజేస్తున్నామన్నారు. క్రీడాకారులు నెల రోజుల పాటు జరిగే ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెటిరో పరిశ్రమ యాజమాన్యం సహకారంతో బోదిగల్లం రోడ్డులో విశాలమైన క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాల బాలికలంతా ఈ వేసవి శిబిరంలో పాల్గొనవచ్చన్నారు.

ఆదర్శనీయుడు సుందరయ్య



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న దృశ్యం



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న దృశ్యం



పుచ్చలపల్లి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం కార్యకర్తలు

మునగపాక : మండలంలోని తోటాడ, వెంకటాపురం గ్రామాల్లో ఆదివారం వామపక్ష నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. తోటాడలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా గవర్ల అనకాపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన నిలువెత్తు రాజకీయాలకు సుందరయ్య ఆదర్శంగా నిలుస్తారన్నారు. సమాజ సేవకు తన జీవితాన్ని త్యాగం చేసిన సుందరయ్య జీవితం ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, ఆళ్ల మహేశ్వరరావు, రామలక్ష్మి, దాడి రమణబాబు, ఆళ్ల వెంకటేష్, నాగేంద్ర పాల్గొన్నారు.


ఎస్.రాయవరం : చినగుమ్ములూరు గ్రామంలో ఉపాధి కూలీల ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ నిరుపేద, బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాట యోధుడని కొనియాడారు.

రాంబిల్లి : కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం మండల కార్యదర్శి జి. దేముడునాయుడు అన్నారు. రాంబిల్లిలో ఆదివారం సీపీఎం నాయకులు , కార్యకర్తలు పుచ్చలపల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. పుచ్చలపల్లి 39 వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుచ్చలపల్లి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా రెండు వారాలు...!

- అభ్యర్థులకు తప్పని టెన్షన్
- ఎన్నికల ఫలితాల కోసం తప్పని ఎదురుచూపులు
- కొందరు టూర్లకు పయనం

యలమంచిలి రూరల్ : మరో 14 రోజులు..ఎవరి ఎవరెవరి తలరాతలు మారతాయో తెలిసేందుకు వేచి ఉండాల్సిన సమయం. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఈ నెల 13న ముగిసినప్పటికీ ఫలితాలు వెలువడేందుకు జూన్ 4 వరకు ఆగాల్సిందే. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నందున చివరి దశ పోలింగ్ జూన్ 1న జరగనుంది. ఆ తర్వాత జూన్ 4న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడి కానున్నాయి. పోటీ చేసిన అభ్యర్థులతో పాటు వారి అనుచరులు, అభిమానులు, ద్వితీయ శ్రేణి నాయకులే కాకుండా రాజకీయాలపై ఆసక్తి ఉన్న వారందరూ వేచి చూడక తప్పదు. ఇప్పటికే పోలింగ్ ముగిసి వారం పూర్తయింది. ఫలితాలకు ఇంకా మరో రెండు వారాలు సమయం ఉండడంతో ఎన్నికల బరిలో ఉన్న పలువురు అభ్యర్థులు, వారి అనుచరులు విహార యాత్రలకో, ఇతరత్రా పనులు చేసుకోవడానికో ప్రణాళిక వేసుకున్నారు. కొందరు అభ్యర్థులు వారి ఇష్ట దైవాన్ని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ దేవాలయాలకు వెళుతున్నారు. మరికొందరు కుటుంబ సమేతంగా విదేశీయాత్రలకు తరలివెళ్లారు. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓట్ల శాతాన్ని బట్టి పలుమార్లు 'పోల్'మార్టం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా తమకు ఎన్ని ఓట్లు పడొచ్చన్న అంచనాకు వచ్చారు. క్రాస్ ఓటింగ్ పైనా ఒక అంచనాకు వచ్చారు. ఎన్ని అంచనాలు వేసుకుంటున్నా ఓట్ల లెక్కింపు వరకూ టెన్షన్ తప్పదని భావిస్తున్నారు. ఇక విజయంపై ఫిఫ్టీ ఫిఫ్టీ అవకాశాలున్నవారు మరింత టెన్షన్ పడే అవకాశముంది. ఊరిలో, ప్రధాన కూడళ్లలో నలుగురు కలిస్తే చాలు ఎన్నికల ఫలితాలపైనే ఎడతెగని చర్చలు సాగుతున్నాయి. గెలుపుపై కాస్త ధీమాగా ఉన్నవారు మాత్రం కుటుంబ సభ్యులతో గడుపుతూ రిలాక్స్ అవుతున్నారు. ఎవరి అంచనాలు ఎలా ఉన్నా ఫలితాల కోసం అభ్యర్థులంతా రోజులు లెక్క పెట్టుకుంటున్నారు.



అప్పటి వరకూ సెగలు కక్కుతూ ప్రకాశించిన భానుడు ఆదివారం సాయంత్రానికి చల్లబడ్డాడు. ఒక్కసారిగా ఆకాశం నీలాకాశంలో వెండి మబ్బులతో దోబూచులాడుతూ ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చాడు. నింగిపై కారుమబ్బులు కమ్ముకున్న సంధ్యవేళ భానుడు మబ్బుల చాటుకు చేరుకున్నాడు. ఆదివారం సాయంత్రం వేళ కనిపించిన ఈ ఆహ్లాదకర దృశ్యమిది. – యలమంచిలి రూరల్

ఘనంగా గ్రీన్‌క్లబ్ దశాబ్ది వేడుకలు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణ, వేసవిలో ఇంటి గూటి పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ అన్నారు. స్థానిక గాంధీనగరం లయన్స్ క్లబ్ ఆవరణలో గ్రీన్ క్లబ్ దశాబ్ది వేడుకలను శనివారం రాత్రి ప్రముఖ సంఘ సేవకులు కర్రి సన్యాసినాయుడు, విశ్రాంత అటవీశాఖ అధికారి బీరా వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో స్థాపించిన గ్రీన్‌క్లబ్ ద్వారా సభ్యుల సహకారంతో ప్రతీనెల జిల్లాలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు, ఉచిత మొక్కల పంపిణీ, ఇంకుడు గుంతల నిర్వహణ, పక్షుల సంరక్షణపై అవగాహన తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలంటే ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. అంతకుముందు తుని పట్టణానికి చెందిన హరిత వికాస్ పర్యావరణవేత్త పాలుపర్తి దాలినాయుడు వరికుంచెలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రీన్‌క్లబ్‌లో 75 సంవత్సరాలు దాటిన ఐదుగురు దంపతులను సత్కరించారు. పర్యావరణహిత స్టాల్స్ ప్రదర్శన, మహిళలకు ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరరావు, సభ్యులు ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, కర్రి హనుమంతరావు, కేవీ గౌరీపతి, శేషసాయి, సభ్యులు పాల్గొన్నారు.